తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభల సందర్భంగా

# మహాసభ ఆమోదానికై ప్రవేశ పెడుతున్న తీర్మానాలు

1. భారత దేశంలో  ప్రతి పౌరునికి పుట్టుకతోనే కులం ఆపాదించబడుతున్నది. కులం ప్రజాస్వామ్యవిలువలను అడ్డుతున్నదని భారత సుప్రీం కోర్టు కూడా ప్రకటించింది. అయినా, కులనిర్మూలనకు ఏ ప్రభుత్వ చర్యలూ లేవు. కులం లేకుండా జీవించాలనుకున్న వారికి ఆధికారిక గుర్తింపు లేదు.ఇటీవల తమిళనాడు లో ఒకరిద్దరు అటువంటి గుర్తింపును  సాధించటం పట్ల ఈ మహాసభ హర్షం వ్యక్తం చేస్తూ, అలాంటి ఆధికారిక గుర్తింపు పొందగోరే వారికి   వీలు కల్పిస్తూ, దేశమంతటావర్తించే ఒక చట్టాన్ని చేయవలసినదిగా కేంద్రప్రభుత్వాన్ని ఈ మహాసభ కోరుతున్నది
2. దేశమంతటా అశాస్త్రీయ వైద్య విధానాలు, హింసను, మూఢత్వాన్ని ప్రోత్సహించే మూఢనమ్మకాలు ప్రతి ఏటా వందలాది మరణాలకు,వేలాది మంది అనారోగ్యాలకు, లక్షలాది ప్రజలకు కలిగే కోట్ల రూపాయల నష్టానికి కారణమవుతున్నాయి. 1954 నాటి మేజికల్ రెమిడీస్ చట్టం ఉన్నప్పటికీ అమలు లేదు. కనుక, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో మాదిరిగా, అమానవీయ మూఢాచారాల, మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని దేశమంతటికి అమలయ్యేలా చేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.
3. దేశంలో మత సామరస్య వాతావరణాన్ని భంగపరిచి, రాజకీయ లబ్ధి పొందేవిధంగా కొన్ని అసాంఘిక శక్తులు చెలరేగుతున్నాయి. ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకుని, చట్టఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. అలాంటి శక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటూ భారతీయ లౌకిక జీవనాన్ని, సాంఘిక శాంతి,భద్రతలను పరిరక్షించవలసినదిగా కేంద్ర ప్రభుత్వాన్నికోరుతూ  ఈ మహాసభ తీర్మానిస్తున్నది.
4. భారతీయ పర్యావరణాన్ని కాపాడటం ఇక్కడి ప్రజల, ప్రభుత్వాల కర్తవ్యం గా ఉండాలి. కానీ, ఆ స్పృహ కొరవడింది. పారిశ్రామిక వ్యర్ధాలు, విషవాయువుల విడుదల,మితిమీరిన రసాయనాల వాడకం,వివిధామతాచారాలు, పండుగలు మొదలైన వాటితో జల,వాయు,రసాయన, భూ కాలుష్యాలు మితిమీరి జీవుల మనుగడకు ప్రమాదకరంగా మారుతున్నాయి. 2021,అక్టోబర్ నాటి “గ్లాస్ గౌ డిక్లరేషన్”కు కట్టుబడుతూ, వెనువెంటనే పర్యావరణ పరిరక్షణ చర్యలపై దృష్టి నిలుపవలసినదిగా ఈ మహాసభ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నిటినీ కోరుతున్నది.
5. నేటి పురుషాధిపత్య సమాజంలో మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. వయసుతో సంబంధం లేకుండా,మహిళలు, యువతులు, బాలికలపై ప్రతి రోజు అత్యాచారాలు జరుగుతూ అందరినీ కలవరపెడుతున్నాయి. కుటుంబజీవనం లో కూడా వారిపై హింస, దౌర్జన్యాలు పెరుగుతున్నాయి. నిందితులపై సరియైన చర్యలు కూడా ఉండటంలేదు. ఈ నేరాల మూలాలు ఆ యా మతాలనుసరిస్తున్న సంస్కృతిలోను,స్త్రీ పురుషుల మధ్య అసమానతలు సుస్థిరమైన సాంఘిక నీతిలోనూ ఉన్నాయని ఈ మహాసభ బావిస్తున్నది. నేరాలకు అవకాశం లేకుండా, స్త్రీపురుష సమానత్వ భావనను మీడియా ద్వారా ప్రచారం లో పెంచుతూ, స్త్రీలపట్ల వ్యాప్తిలో ఉన్న మతదృష్టినుండి  ప్రజలు దూరమయ్యే విధం గా విద్యా ప్రణాళికలో తగు మార్పులు తేవలసినదిగాను, ఈ అంశం పై పనిచేసే స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించ వలసినదిగాను   ఈ మహాసభ ప్రభుత్వాలను కోరుతూ తీర్మానిస్తున్నది .
6. ప్రజలలో శాస్త్రీయ దృక్పథం కనీస స్థాయిలో కూడా లేకపోవటం వల్ల చాలా సమస్యలు తలెత్తుతున్నాయి. సైన్సు పరిశోధనలకు, విద్యారంగంలో  సైన్సు పట్ల ఉన్న నిరాదరణకు, ప్రభుత్వాలు సైన్సు పట్ల చూపుతున్న నిర్లక్ష్యమే కారణం. ఈ నిర్లక్ష్యపు మూల్యాన్ని అవి గుర్తించటం లేదు. శాస్త్రీయ దృష్టిని ప్రజల్లో పెంచటం, ప్రజాసంక్షేమంలో ఒక భాగం. ఇప్పటికైనా ఈ అంశాన్ని గుర్తించి సైన్సు పరిశోధనలకు, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంచే ప్రచారాలకు ఎక్కువ నిధులు కేటాయించి, తగు ప్రణాళికలను అమలు చేయవలసినదిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఈ సభ కోరుతున్నది.
7. ప్రజల హక్కులను కాపాడటం ప్రభుత్వ ముఖ్యవిధుల్లో ఒకటి. ఆ విధిని విస్మరిస్తూ, హక్కులను హరించే అనేక అప్రజాస్వామిక చట్టాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్న విషయం అందరూ గమనిస్తున్నారు. కాలం చెల్లిన  రాజద్రోహచట్టమే కాక,ఉపా,టాడా లాంటి చట్టాలు కూడా, రాజ్యాంగం ప్రజలకిచ్చిన  ప్రజాస్వామిక హక్కులను, స్వేచ్ఛను కూడా హరిస్తూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కనుక, అలాంటి చట్టాలను వెనువెంటనే తొలగించాలని కేంద్రప్రభుత్వానికి, భారత రాష్ట్రపతికి విజ్ఞప్తి చేస్తున్నది.

మహాసభ ఆమోదానికి  ఈ తీర్మానాలను ప్రవేశపెడుతున్నాను. ఆమోదాన్ని చప్పట్ల ద్వారా తెలుపగోరుతున్నాను.